క్లుప్తంగా

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

పొన్నూరు: ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ శివ సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో నూరు శాతం పన్నులు వసూలు చేయాలని చెప్పారు. కార్మికులకు జీతాలు చెల్లించాలని, జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకానికి సంబంధించిన అన్ని వివరాలు సక్రమంగా పరిశీలించాలన్నారు. ఇంటి పన్ను సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.

కోదండ రామాలయంలో విశేష పూజలు



పొన్నూరు: పట్టణంలోని తెలగపాలెంలో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు. పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు చిలకపాటి లక్ష్మణ రామాచార్యులు, దేవరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల పరిశీలన



గుంటూరు రూరల్: వక్ఫ్ బోర్డ్ ఆస్తులను కాపాడి, వాటి పరిరక్షణకు కృషిచేస్తున్నట్లు వక్ఫ్ బోర్డ్ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని తెలిపారు. మంగళవారం 48వ డివిజన్‌లోని రెడ్డిపాలెంలో వక్ఫ్‌బోర్డ్ భూములను ఆయన సందర్శించారు. వాటి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వక్ఫ్ బోర్డ్ ఆస్తులను అన్యాక్రాంతం చేసిన.. ఆక్రమణలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ టి.కృష్ణారెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా, బోర్డ్ డైరెక్టర్లు ఒమర్ అలీ, షేక్ మస్తాన్‌వలీ, సయ్యద్ సుభాని, కరిముల్లా, జానీబాషా, మున్న, షేక్ సుబాని, ముత్తవలీలు, ముజావర్‌లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు తదితరులున్నారు.

అర్హులందరికి పింఛన్లు



చేబ్రోలు: అర్హులైన పేదలందరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లను అందిస్తోందని జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నూతన పింఛన్‌దారులకు పింఛన్ నగదును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాబురావు, ఎంపీపీ కె.సాహితి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదిక ప్రాంగణంలో ధనుర్మాసం సందర్భంగా టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజల్వనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ కోగంటి వేంకట రంగనాయకి ప్రవచనం ఆకట్టుకుంది. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో దీపాలంకరణ చేశారు.

'108' ఉద్యోగుల వినతి

గుంటూరు మెడికల్: గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాను మంగళవారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో 108 అంబులెన్సు ఉద్యోగులు కలిసి తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వినతి పత్రం అందజేశారు. ప్రతి నెలా అరబిందో సంస్థ వేతనాలు చెల్లించడంలో జాప్యం చేయడంతో తాము ఇబ్బంది పడుతున్నామని వెల్లడించారు.

స్త్రీ విద్యకు.. పూలే కృషి మరువ లేనిది

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుచరిత తదితరులు



సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కత్తి స్వర్ణ కుమారి

గుంటూరు రూరల్: స్త్రీ విద్యకు సావిత్రిబాయి పూలే చేసిన కృషి మరువలేనిదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సావిత్రి బాయిపూలే 192వ జయంతి కార్యక్రమం జరిగింది. తన భర్త, మాజీ ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ మేకతోటి దయాసాగర్‌తో కలిసి ఎమ్మెల్యే సుచరిత సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్త్రీ విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన కృషి వల్లే నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. పూలే సంస్కరణలు నేటికీ మార్గదర్శకంగా నిలిచాయన్నారు. దేశంలో అసమానతలను రూపుమాపి, అక్షర ఉద్యమానికి నాంది పలికిన మహా నాయకురాలు పూలే అని ఎమ్మెల్యే కొనియాడారు. దయాసాగర్ మాట్లాడుతూ.. స్త్రీలకు విద్యా సంస్థలను ఏర్పాటు చేసి, మహిళల ఉన్నతికి నిరంతరం కృషిచేసిన వ్యక్తి పూలే అని తెలిపారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని.. బాలికల విద్యాభివృద్ధికి కృషిచేసిన మహనీయురాలు పూలే అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, పలు మార్కెట్ యార్డు, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, అధ్యక్షులు, డైరెక్టర్‌లు, సొసైటీల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలి

పొన్నూరు: సావిత్రిబాయి పూలేకు భారత రత్న ఇవ్వాలని కవి, దళిత ఉద్యమ నేత డాక్టర్ కత్తి పద్మారావు ప్రభుత్వాన్ని కోరారు. పొన్నూరు లుంబిని వనంలో భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 192వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి కత్తి పద్మారావు సతీమణి, రీసెర్చ్ సెంటర్ కో-ఆర్డినేటర్ కత్తి స్వర్ణ కుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కత్తి పద్మారావు మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే భారత దేశంలో విద్యా వేగుచుక్క, దళిత విద్యార్థులకు పాఠశాల నిర్మించిన గొప్ప ప్రబోధిని, భర్తతో కలసి విదవ వివాహ వేదిక నిర్మించిన సామాజిక విప్లవ కారిణి అని పేర్కొన్నారు. విద్యా విప్లవానికి బాటలు వేశారని కొనియాడారు. కుల, మత భేదభావం లేకుండా విద్యను ఒక జ్ఞాన స్రవంతిగా ప్రవహింపజేసిన మహోజ్వలమైన వ్యక్తి సావిత్రిబాయి పూలే అని ప్రశంసించారు. ప్రతి ఇంటిలో, గ్రామంలో సావిత్రి బాయి పూలే చిత్రపటాన్ని ఆవిష్కరించాలని కోరారు. సావిత్రిబాయి పూలే జయంతిని ఉపాధ్యాయరాలు దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు.

సావిత్రి బాయి పూలేకు ఘన నివాళి



పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉపాధ్యాయులు

పొన్నూరు: మహిళా ఉన్నతికి ఎంతో కృషి చేసిన సావిత్రిబాయి పూలే సేవలు మరువరానివని వైఎస్సార్ సీపీ నాయకులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు అన్నారు. స్థానిక ఆలపాటి సుబ్బారాయుడు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం సావిత్రిబాయి పూలే 192వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేడు మహిళలకు విద్య అందుతుందంటే ఆనాడు సావిత్రిబాయి పూలే కృషి ఫలితమే అన్నారు. జ్యోతిరావు పూలేతో కలసి అణగారిన వర్గాల ఉన్నతి కోసం కృషి చేశారన్నారు. ప్రతి మహిళ సావిత్రి బాయి పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదే విధంగా సీపీఐ కార్యాలయంలో ఆరేటి రామారావు ఆధ్వర్యంలో పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మేలు కోరే ప్రభుత్వానికి అండగా ఉండాలి

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



నూతన ఫించన్‌దారులకు నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరోశయ్య

పెదకాకాని: పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోరే ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పేర్కొన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా పింఛన్‌లు మంజూరైన 330 మందికి ఆయన నగదును మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ఏటా రూ.250లు చొప్పున పింఛన్ నగదు పెంచుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం..'నేను విన్నాను - నేను ఉన్నాను అనే నినాదంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. అర్హతే ఆధారంగా.. పార్టీలకు, గ్రూపులకు, వర్గాలకతీతంగా పింఛన్ల పంపిణీ జరుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. అవ్వాతాతలు పంచాయతీ కార్యాలయాలకు, పోస్టాఫీసులకు తిరిగి పడిగాపులు కాసే రోజులు పోయాయని, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారే సరికి పింఛన్ నగదు ఇంటికి వచ్చి చేరుతోందని తెలిపారు. ముందుగా సావిత్రీబాయి పూలే 192వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ మల్లేశ్వరరావు, తహసీల్దారు రత్నం, గ్రామ సర్పంచులు పిట్టు శివకృష్ణారెడ్డి, వేల్పుల శ్రావణి, నంబూరు జ్యోతి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం కోసం.. ప్రజల ప్రాణాలతో బాబు చెలగాటం

పొన్నూరు: ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు ప్రచార పిచ్చితో పేదల ప్రాణాలతో ఆటలాడుతున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అధికార దాహంతో పేదల జీవితాలను అంధకారం చేస్తున్నారని మండిపడ్డారు. గోదావరి పుష్కరాల్లోనూ 29 మందిని, కందుకూరు సభలో 8 మందిని కేవలం ప్రచార ఆర్భాటాల కోసం బలితీసుకున్నారని ఆరోపించారు. అయినా..ఆ దుర్ఘటనల నుంచి గుణపాఠాలు నేర్వలేదన్నారు. తాజాగా గుంటూరు సభలో ముగ్గురి ప్రాణాలు తీసిన పాపం చంద్రబాబునాయుడిని జీవితాంతం వెంటాడుతూనే ఉంటుందన్నారు. చంద్రబాబుకు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు నిజం మాట్లాడే అలవాటు లేదని విమర్శించారు. టీడీపీ నాయకుల నిర్లక్ష్యంతోనే కందుకూరు, గుంటూరులో పేదలు మృతి చెందారని ఆరోపించారు. చీరలు, నిత్యావసర సరుకులు ఇస్తామని పేదలను పిలిచి.. వారి జీవితాలతో ఆటలాడారని మండిపడ్డారు. రెండు ఘటనల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అండగా నిలిచినట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు చొప్పున.. క్షతగాత్రులకు రూ.50వేలు అందించినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు టోకెన్‌లు పెట్టి, గోరంత ఇచ్చి.. కొండంత ప్రచారం చేసుకునేందుకు ప్రయత్నించడంతో.. పేదలు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన టీడీపీ నాయకులు సిగ్గు పడాలని, సభలు, సమావేశాలు పెట్టుకునేందుకు సరైన స్థలాలు ఎన్నుకోవాలని హితవు పలికారు. లేదంటే రానున్న రోజుల్లో ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు.

మార్చి 15 నాటికి నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

నెహ్రూనగర్: మార్చి 15 నాటికి పన్ను వసూళ్ల నూరు శాతం పూర్తి కావాలని, అందుకు తగిన విధంగా ఆర్ఐకు లక్ష్యాలను నిర్దేశించామని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా తెలిపారు. మంగళవారం అదనపు కమిషనర్ తన చాంబర్‌లో పన్ను వసూళ్లపై డిప్యూటీ కమిషనర్లు, ఆర్ఓలు, ఆర్ఐలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డిసెంబరు 31వ తేదీ ఒక్కరోజు కలెక్షన్‌లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో గుంటూరు నగర పాలక సంస్థ నిలవడంలో కృషి చేసిన రెవెన్యూ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో రూ.144 కోట్ల డిమాండ్‌కు గాను, ఇప్పటి వరకు రూ.75.20 కోట్లు వసూళ్లు కాగా మిగిలిన రూ.68.8 కోట్లు బకాయి వసూళ్లకు బుధవారం నుంచే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. జనవరి 1 నుంచి ప్రస్తుత అర్థ సంవత్సరానికి కూడా వడ్డీ నమోదు అయినందున వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. పన్ను చెల్లింపులో స్పందించని బకాయిదార్లకు రెడ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. పన్ను చెల్లింపుపై అవగాహన కల్పించేందుకు జనవరి నెలాఖరు నుంచి ప్రచార ఆటోలను కేటాయిస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ, ఆర్ఓలు ప్రసాద్, బాలాజీ బాష, రవి కుమార్, పోలేశ్వరరావు, సూపరింటెండెంట్ వెంకట రామయ్య, ఆర్ఐలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



సచివాలయ ఉద్యోగులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ నూతన క్యాలెండర్‌ను నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు ఆవిష్కరించారు. సంపత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీఆర్ఆర్ కిషోర్, జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన రాజేష్, జనరల్ సెక్రటరీ అనిల్ రాథోడ్, ధనలక్ష్మి, చైతన్య, కమల్‌హాసన్, తోట మహేష్, చల్లా శ్రీనివాస్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి



పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీడీ శివశంకర్‌ప్రసాద్

పెదకాకాని: గర్భం ధరించగానే తల్లి ఆరోగ్య వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్(డెమో) శివశంకర్ ప్రసాద్ సూచించారు. పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కిల్కారి మాత శిశు ఆరోగ్య సేవలపై గర్భిణులకు.. ముఖ్య సూచనలు అందించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిల్కారి మాత శిశు సేవలపై ఆశ వర్కర్లు అవగాహన పెంపొందించుకుని, విధిగా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ఆశ కార్యకర్తలకు విజ్ఞానం పెంపొందించేందుకు మొబైల్ అకాడమీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆశ కార్యకర్తలు వారి పరిధిలో గర్భం దాల్చిన మహిళ సమాచారాన్ని వెంటనే తెలుసుకుని ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయించాలన్నారు. వైద్య పరీక్షలు చేయించి రక్త హీనత భారిన పడకుండా ఐరన్ టాబ్లెట్లు వాడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గణాంక శాఖ అధికారి గోపాలకృష్ణ, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నారాయణ స్వామి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పుసులూరి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



పొన్నూరు: రైలు ఢీ కొని నిడుబ్రోలుకు చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. నిడుబ్రోలుకు చెందిన బి.రాజు(45) పొన్నూరు నుంచి నిడుబ్రోలు వెళ్తున్నాడు. రైల్వే ట్రాక్ దాటే సమయంలో తెనాలి వైపు నుంచి వస్తున్న రైలు రాజును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాపట్ల రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ భాస్కర్ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

పట్నంబజారు: యువకుడిని రాళ్లతో కొట్టిన చంపిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. కేవీపీ కాలనీకి చెందిన రాయి మణికంఠ క్యాటరింగ్ పనిచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. వ్యసనాలకు బానిసగా మారి నిత్యం రోడ్లపై పడుకోవటం, లాడ్జిల్లో ఉండటం చేస్తుండేవాడు. గత నెల 31న రాత్రి గుంటూరు జీజీహెచ్ మార్చురీ వద్ద ఉన్న బస్ స్టాప్‌లో పడుకునేందుకు వెళ్లాడు. క్యాటరింగ్ పనులు చేసుకునే తెనాలికి చెందిన అరవపల్లి భువనేశ్వర్, విజయవాడకు చెందిన షేక్ ఆసీఫ్‌లతో కలిసి మద్యం సేవించాడు. ఈ క్రమంలో ఏర్పడిన స్వల్ప వివాదం కారణంగా మణికంఠను రాళ్లతో తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులైన భువనేశ్వర్, ఆసీఫ్‌లను సోమవారం సాయంత్రం ఏసీ కళాశాల ఎదురుగా వైటనర్ సేవిస్తుండగా అదుపులోకి తీసుకుని, విచారించారు. మణికంఠను హత్య చేసినట్లు వారు అంగీకరించారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

బ్రాహ్మణ సేవాసమితి భవనంలో వృద్ధాశ్రమం

గుంటూరు మెడికల్: బ్రాహ్మణ సేవా సమితి నూతన భవనంలో వద్ధాశ్రమం, విద్యార్థి వసతి గృహం ఏర్పాటు చేసినట్లు బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు అధ్యక్షుడు ఆర్.లక్ష్మీపతి చెప్పారు. మంగళవారం స్థానిక బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో తమ సమితి చేస్తున్న కార్యక్రమాలను కార్యదర్శి కొప్పర్తి సీతా రమేష్‌తో కలిసి వెల్లడించారు.

నేడు వెనిగండ్లలో ఉచిత కంటి వైద్య శిబిరం

పెదకాకాని: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, బజరంగ్ నేత్ర జ్యోతి ద్వారా ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తలసేమియా వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. వలంటీర్లకు అవగాహన, పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. వలంటీర్లకు రూ.5 వేలు ప్రమాద బీమా వంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మురళీకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పొన్నూరు:చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. బాపట్లకు చెందిన సయ్యద్ అబ్దుల్లా (20) గత నెల 28న గుంటూరు నుంచి బాపట్లకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న అతను సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి బాజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భార్గవ్ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు రూరల్: విద్యార్థిని అదృశ్యంపై మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం పాత గుంటూరుకు చెందిన అల్లం రామకృష్ణ బావ కుమార్తె సోమిశెట్టి స్రవంతి నగర శివారులోని సెయింట్ మేరీస్ కళాశాలలో డిప్లమో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 1వ తేదీన కళాశాలకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వెళ్లేందుకు పర్మిషన్ తీసుకుని బయటకు వచ్చింది. కానీ, స్రవంతి ఇంటికి రాకపోవటంతో మేనమామ రామకృష్ణ బంధువులు, చుట్టుపక్కల వారిని విచారించిన లభించలేదు. అనంతరం పోలీసులును ఆశ్రయించడంతో.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చిట్స్ కంపెనీపై కేసు నమోదు

పట్నంబజారు: ప్రభుత్వ అనుమతులు లేకుండా చిట్టీలు వేస్తున్న కంపెనీపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గౌడీయమఠం సమీపంలో ఉన్న శ్రీ గోకులం చిట్స్ అండ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ఎటువంటి అమతులు లేకుండా చిట్‌ఫండ్ కంపెనీ, ఫైనాన్స్ చేస్తూ.. వసూళ్ల కోసం నోటీస్‌లు జారీ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ క్రమంలో కొంత మంది బాధితుల ఫిర్యాదు మేరకు గత కొద్ది రోజుల క్రితం రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ ఎంవీ సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.